

తెలుగు దినపత్రిక

https://aksharagalam.com

# అక్షరగళం

ప్రతి అక్షరం ప్రజల కోసం

హైదరాబాద్
రంగారెడ్డి - మేడ్చల్

సోమవారం, ఫిబ్రవరి 9, 2026 పేజీలు: 3


# నాంపల్లి ఫోరెన్సిక్ ల్యాబ్ సీజ్..




## 40 కంప్యూటర్లు, డేటా స్టోరేజ్ పరికరాలు దగ్ధం

## ప్రమాదమా? కుట్రా? అన్న కోణంలో పోలీసుల విచారణ

## ఘటనా స్థలానికి ఎఫ్ఎస్ఎల్ డైరెక్టర్ శిఖా గోయల్

## కేసుల దర్యాప్తుపై ప్రభావంపై ఆందోళనలు

హైదరాబాద్: నాంపల్లి ప్రాంతంలో ఉన్న తెలంగాణ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్) భవనంలో జరిగిన అగ్ని ప్రమాదం తీవ్ర కలకలం రేపింది. ఘటన నేపథ్యంలో ఆదివారం ఉదయం పోలీసులు మొత్తం ల్యాబ్ భవనాన్ని సీజ్ చేసి దర్యాప్తును వేగవంతం చేశారు. ప్రమాదం ఎలా జరిగింది? ఇది ప్రమాదవశాత్తు జరిగిందా లేక వెనుక కుట్రకోణం ఉందా? అనే కోణాల్లో విచారణ కొనసాగుతోంది.

### క్లూస్ టీం, సీసీటీవీ ఫుటేజీ పరిశీలన

ఈ అగ్నిప్రమాదంపై స్పష్టత కోసం క్లూస్ టీం ఎస్పీ నేతృత్వంలో ప్రత్యేక బృందం మరోసారి ల్యాబ్‌లో తనిఖీలు చేపట్టనుంది. ప్రమాద సమయంలో కార్యాలయంలో ఎవరు ఉన్నారు, ఎవరైనా అనుమానాస్పదంగా కదలాడారా అనే అంశాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. అలాగే, భవనంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఫుటేజీని సవివరంగా పరిశీలిస్తున్నారు. ప్రమాదంలో ల్యాబ్‌లోని కంప్యూటర్ గదిలో ఉన్న సుమారు 40 కంప్యూటర్లు, హార్డ్‌డిస్కులు, ల్యాప్‌ట్యాప్‌లు, పెన్‌డ్రైవ్‌లు పూర్తిగా దగ్ధమైనట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. డిజిటల్ డేటాకు సంబంధించిన పరికరాలు ఎక్కువగా నష్టం చెందడంతో సమాచారంపై ప్రభావం పడిందా? అనే అంశంపై కూడా విచారణ జరుగుతోంది.




# 28న నింగిలోకి 'రుద్రమ వి.1'

## హనుమకొండ నుంచి నమూనా రాకెట్ ప్రయోగం

## నిట్ వరంగల్ విద్యార్థుల భాగస్వామ్యంతో ప్రయోగం

## హయగ్రీవాచారి మైదానంలో లాంచింగ్‌కు ఏర్పాట్లు

## లాంచింగ్ తర్వాత ఇస్రో శాస్త్రవేత్తలతో టాక్‌షోలు

## వరంగల్‌లో అంతరిక్ష విజ్ఞానోత్సవ వాతావరణం




# పీటీపీపై జీహెచ్ఎంసీ ఫోకస్

## ఆస్తిపన్ను వసూళ్ల పెంపుకు కఠిన చర్యలు

## భారీ బకాయిలున్న వారిపై ముందస్తు దృష్టి

## గడువు దాటితే సీజ్ చర్యలకు అవకాశం

ఇంకా ప్రకటించని ప్రాపర్టీ ట్యాక్స్ పరిష్కారం

**ఆర్థిక సంవత్సరం ముగింపు దశకు చేరుకోవడంతో ఆస్తిపన్ను వసూళ్లు పెంచుకునేందుకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) కఠిన చర్యలకు సిద్ధమైంది. ఆస్తిపన్ను బకాయిలు ఉన్న వారిపై రెడ్ నోటీసులు జారీ చేయడం ప్రారంభించింది. తొలుత జోన్లు, సర్కిళ్ల పరిధిలో భారీ మొత్తంలో బకాయిలు ఉన్న ఆస్తి యజమానులను గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఆస్తిపన్ను ఇప్పటివరకు చెల్లించని వారందరికీ దశలవారీగా రెడ్ నోటీసులు జారీ చేయనున్నారు.**

హైదరాబాద్: నగరంలోని కొన్ని సర్కిళ్లలో రెడ్ నోటీసుల జారీ ఇప్పటికే ప్రారంభమైంది. మిగిలిన సర్కిళ్లలోనూ త్వరలోనే ఈ ప్రక్రియ చేపట్టేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రెడ్ నోటీసుల్లో పేర్కొన్న గడువులోగా ఆస్తిపన్ను చెల్లించని పక్షంలో చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. అవసరమైతే దుకాణాలు, వాణిజ్య సముదాయాలను సీజ్ చేయడం వంటి చర్యలకూ వెనుకాడబోమని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

### పీటీపీపై స్పష్టత లేని పరిస్థితి

గతంలో ప్రతి ఏడాది ఫిబ్రవరి నుంచి మార్చి వరకు ప్రతి ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రాపర్టీ ట్యాక్స్ పరిష్కారం (పీటీపీ) పేరుతో జీహెచ్ఎంసీ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించేది. నగరంలోని అన్ని సర్కిల్ కార్యాలయాల్లో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసి, ప్రజల ఆస్తిపన్ను సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపేవారు. వాస్తవ విస్తీర్ణానికి మించిన పన్ను విధింపు, ఆస్తిపన్ను చెల్లించినప్పటికీ రికార్డుల్లో నమోదు కాకపోవడం, ఇతరత్రా వ్యత్యాసాలపై ప్రజలు అధికారులను నేరుగా సంప్రదించే అవకాశం ఉండేది.

### ఉన్నతాధికారుల ప్రత్యక్ష భాగస్వామ్యం

ఈ పీటీపీ కార్యక్రమంలో

మిగతా 2లో

# 28న నింగిలోకి 'రుద్రమ వి.1'

**హనుమకొండ నుంచి నమూనా రాకెట్ ప్రయోగం**

**నిట్ వరంగల్ విద్యార్థుల భాగస్వామ్యంతో ప్రయోగం**

**హయగ్రీవాచారి మైదానంలో లాంచింగ్‌కు ఏర్పాట్లు**

**లాంచింగ్ తర్వాత ఇస్రో శాస్త్రవేత్తలతో టాక్‌షోలు**

**వరంగల్‌లో అంతరిక్ష విజ్ఞానోత్సవ వాతావరణం**




కాజీపేట : హనుమకొండ జిల్లాలోని హయగ్రీవాచారి మైదానం నుంచి ఈనెల 28న నమూనా రాకెట్ 'రుద్రమ వి.1' నింగిలోకి దూసుకెళ్లనుంది. నిట్ వరంగల్ ఆధ్వర్యంలో రూపొందించిన ఈ నమూనా రాకెట్ ప్రయోగానికి సంబంధించిన లాంచింగ్ వాల్‌పోస్టర్‌ను నిట్ వరంగల్ సెమినార్ హాల్‌లో నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ, కుడా వైస్ చైర్‌పర్సన్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, ఏటీడీఆర్‌ఎల్ ప్రతినిధి శశాంక్ ఆవిష్కరించారు.

### విద్యార్థులకు అంతరిక్ష శాస్త్రంలో ప్రోత్సాహం

ఈ సందర్భంగా నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ మాట్లాడుతూ నమూనా రాకెట్‌కు 'రుద్రమ వి.1' అనే పేరు పెట్టి లాంచింగ్ చేయడం గర్వకారణమన్నారు. నిట్ వరంగల్‌లోని ఆస్ట్రానమీ క్లబ్, శాటిలైట్ క్లబ్ విద్యార్థులు ఈ ప్రాజెక్టులో భాగస్వాములవడం అభినందనీయమని చెప్పారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానంపై ఆసక్తిని పెంచుతాయని పేర్కొన్నారు.

### లాంచింగ్‌కు విస్తృత ఏర్పాట్లు

హయగ్రీవాచారి మైదానంలో రుద్రమ వి.1 నమూనా రాకెట్ లాంచింగ్‌ను ప్రత్యక్షంగా వీక్షించేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. శ్రీహరికోటలో జరిగే రాకెట్ ప్రయోగాలను తలపించే విధంగా లాంచింగ్ ఏర్పాట్లు ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమం వరంగల్‌ను మరోసారి శాస్త్ర, సాంకేతిక కేంద్రంగా నిలబెడుతుందని అభిప్రాయపడ్డారు.

### ఏడు గ్రహాల వీక్షణకు టెలిస్కోపులు

గతేడాది నాలుగు గ్రహాలు ఒకేసారి దర్శనమివ్వగా, ఈ ఏడాది ఏడు గ్రహాలను వీక్షించే అరుదైన అవకాశం ఉందని చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. ఇందుకోసం ఈనెల 18 నుంచి 10 రోజులపాటు వరంగల్ హంటర్ రోడ్డులోని భద్రకాళిబండ్‌పై నాలుగు టెలిస్కోపులు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలు, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

### లాంచింగ్ అనంతరం టాక్‌షోలు

రాకెట్ లాంచింగ్ అనంతరం వరంగల్‌లోని కాళోజీ కళాక్షేత్రంలో ఇస్రో శాస్త్రవేత్తలు, ప్రముఖ విద్యావేత్తలు, విశిష్ట అతిథులతో ప్యానల్ చర్చలు, టాక్‌షోలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అంతరిక్ష సాంకేతిక రంగంలో జరుగుతున్న తాజా పరిణామాలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

### స్టార్టప్ ద్వారా తొలి ప్రయోగం

నిట్ వరంగల్‌లో అంతరిక్ష సాంకేతిక ప్రాజెక్టుల ద్వారా విద్యార్థులను భవిష్యత్ శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని ఇస్రో నోడల్ సెంటర్ కోఆర్డినేటర్, నిట్ ప్రొఫెసర్ ఎల్.ఆంజనేయులు తెలిపారు. స్టార్టప్‌గా ఏర్పడిన ఏటీడీఆర్‌ఎల్ ద్వారా తొలిసారిగా నమూనా రాకెట్ రుద్రమ వి.1 లాంచింగ్‌కు ఏర్పాట్లు చేసినట్లు ప్రతినిధి శశాంక్ చెప్పారు.



## వంద కోట్ల భూమిని కాపాడిన హైడ్రా..

హైదరాబాద్ : హైదరాబాద్ లోని ప్రభుత్వ స్థలాల ఆక్రమణదారులపై ఉక్కుపాదం మోపుతున్న హైడ్రా అధికారులు తాజాగా వంద కోట్ల విలువైన నాలుగు ఎకరాల స్థలాన్ని కాపాడారు. ఆక్రమణలు కూల్చివేసి కబ్జాదారుల చెర నుంచి విలువైన భూమిని విడిపించారు. అమీన్ పూర్ లోని చక్రపురి లేఔట్ లో రోడ్లు, పార్కు స్థలం కబ్జాకు గురైందని స్థానికులు ఫిర్యాదు చేయడంతో హైడ్రా అధికారులు రంగంలోకి దిగారు. ఈరోజు ఉదయం బుల్డోజర్లతో అమీన్ పూర్ చేరుకున్న అధికారులు.. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి కట్టిన నిర్మాణాలను కూల్చివేశారు. పోలీస్ సిబ్బంది బందోబస్తుతో రెవెన్యూ అధికారుల సమక్షంలో హైడ్రా అధికారులు మొత్తం 15 జేసీబీలతో ఆక్రమణలు తొలగించారు. దీంతో పాటు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా దూలపల్లి విలేజ్‌లోని సుమారుకుంటలో, నాగారం రామకృష్ణ నగర్ కాలనీలోని శివాలయానికి చెందిన 1,365 గజాల స్థలాన్ని, యూసుఫ్గూడలో మూడున్నర ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా హైడ్రా కాపాడింది.

## పీటీపీపై జీహెచ్ఎంసీ ఫోకస్




సంబంధిత ట్యాక్స్ సెక్షన్ అధికారులు మాత్రమే కాకుండా, డిప్యూటీ కమిషనర్లు, జోనల్ కమిషనర్లు సైతం పాల్గొని ప్రజల సందేహాలను నివృత్తి చేసేవారు. దీంతో ఆస్తిపన్ను చెల్లింపులపై స్పష్టత పెరిగి, వసూళ్లకూ ఊతమిచ్చేది. కానీ ఈ ఏడాది ఫిబ్రవరిలో ఒక ఆదివారం ముగిసిపోయినా, ఇప్పటివరకు పీటీపీ నిర్వహణపై జీహెచ్ఎంసీ ఎలాంటి ప్రకటన చేయలేదు.

### రెండేళ్లుగా నిర్లక్ష్యమే?

పీటీపీ నిర్వహిస్తే ప్రజలు తమ ఆస్తిపన్ను సమస్యలను పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని పన్ను చెల్లింపుదారులు అభిప్రాయపడుతున్నారు. అయితే అధికారులు ఈ అంశాన్ని పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గత రెండేళ్లుగా పీటీపీ నిర్వహణలో నిర్లక్ష్యం కనిపిస్తోందని ఆరోపణలు ఉన్నాయి. సాధారణంగా రెండు నెలలు నిర్వహించాల్సిన ఈ కార్యక్రమాన్ని 2024లో కేవలం మార్చి నెలలో మాత్రమే చేపట్టారు. గత ఏడాది ఫిబ్రవరి చివరి వారంలో ప్రారంభించారు.

### ఈ ఏడాది ఉంటుందా? ఉండదా?

ఈ సంవత్సరం పీటీపీ ఎప్పుడు నిర్వహిస్తారు? అసలు నిర్వహిస్తారా? అన్నదానిపై స్పష్టత లేకపోవడంతో నగరవాసుల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు రెడ్ నోటీసులతో కఠిన చర్యలు చేపడుతుండగా, మరోవైపు సమస్యల పరిష్కార వేదిక అయిన పీటీపీని ప్రకటించకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తమవుతోంది.

## దివ్యాంగులైన ఓటర్లకు కనీస సౌకర్యాలు కల్పించాలి

**::: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి**

అక్షర గళం, మేడ్చల్ ప్రతినిధి: ఈ నెల 11న మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ ల సాధారణ ఎన్నికలను పురస్కరించుకొని ఓటు హక్కు వినియోగించుకునే దివ్యాంగులైన ఓటర్లకు కనీస సౌకర్యాలు కల్పించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ ల సాధారణ ఎన్నికల్లో భాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని మూడుచింతలపల్లి, అలియాబాదు, ఎల్లంపేట్ మున్సిపాలిటీలలో ఈ నెల 11న ఎన్నికలలో దివ్యాంగులైన ఓటర్లకు కనీస అవసరమైన సౌకర్యాలు కల్పించి పోలింగ్ ప్రక్రియలో వారు చురుకుగా పాల్గొనేందుకు ప్రోత్సహించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఉన్న దివ్యాంగుల ఓటర్ల సంఖ్యను బట్టి, ర్యాంపులు, వీల్చైర్లు వంటి సౌకర్యాలు అందుబాటులో ఉంచాలన్నారు. దివ్యాంగులైన ఓటర్లకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు పోలింగ్ సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు. వికలాంగులకు ప్రాధాన్య ప్రవేశ పాసులు జారీ చేయాలని, దివ్యాంగులు క్యూలో వేచి ఉండాల్సిన అవసరం లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వివరించారు.



## వైభవంగా శ్రీ శ్రీ శ్రీ కట్ట మైసమ్మ దేవి జాతర

అక్షర గళం, కుత్బుల్లాపూర్ : కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని సూరారం పరిధిలో ప్రసిద్ధిగాంచిన శ్రీ శ్రీ శ్రీ కట్ట మైసమ్మ దేవి జాతర అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. అనంతరం జాతర నిర్వహణకు సంబంధించి పోలీస్ శాఖ , మున్సిపల్ శాఖలు చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించి, భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

### పరువు పేరిట దౌర్జన్యం.. అల్లుడి ఇంటిని దగ్ధం చేసిన మామ

కూతురు తమకు ఇష్టం లేని కులాంతర వివాహం చేసుకుందనే కోపంతో ఓ తండ్రి అల్లుడి ఇంటికి నిప్పుపెట్టిన దారుణ సంఘటన మంచిర్యాల జిల్లాలో చోటుచేసుకుంది. భీమారం మండలం దాంపూర్ గ్రామంలో జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దాంపూర్ గ్రామానికి చెందిన జంగపెల్లి సురేందర్, అదే గ్రామానికి చెందిన అంజలి కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ఇటీవల వారు వివాహం చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న అంజలి కుటుంబ సభ్యులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. సురేందర్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో అక్కడికి వెళ్లి, ఇంటికి తాళం వేసి ఉండటంతో పెట్రోల్ పోసి నిప్పంటించారు.

# నీట్ యూజీ దరఖాస్తుల స్వీకరణ షురూ

## మార్చి 8 వరకు దరఖాస్తుకు గడువు.. మే 3న పరీక్ష

హైదరాబాద్: ఎంబీబీఎస్, బీడీఎస్ సహా ఇతర వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్‌యూజీ) 2026 షెడ్యూల్ విడుదలైంది. ఈ షెడ్యూల్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ఆదివారం విడుదల చేసింది. ఆదివారం నుంచే ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. విద్యార్థులు మార్చి 8వ తేదీ రాత్రి 9 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. అదే రోజు రాత్రి 11:50 గంటల వరకు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించవచ్చు. మార్చి 10 నుంచి 12 వరకు దరఖాస్తుల్లో దొర్లిన తప్పులను సవరించుకోవచ్చు. జనరల్ కేటగిరీ రూ. 1,700, ఈడబ్ల్యూఎస్, ఓబీసీలు రూ. 1,600, ఎస్సీ, ఎస్టీ, వికలాంగులు రూ. 1,000 పరీక్ష ఫీజును చెల్లించాల్సి ఉంటుంది. ఇక ఎన్నారైలు రూ. 9,500 ఫీజుగా చెల్లించాల్సి ఉంటుందని ఎన్టీఏ వెల్లడించింది. నీట్ యూజీ పరీక్షలను మే 3న నిర్వహించనున్నట్లు తెలిపింది. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ పరీక్షను నిర్వహిస్తారు. ష్ట్రజూం://ఝ.ఖఎ.అఅ, ష్ట్రజూం://అవవ్.ఝ.అఱఎ.అఅ వెబ్‌సైట్లలో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొంది. సిటీ ఇన్ఫర్మేషన్ స్లిప్ (ఏ పట్టణంలో పరీక్ష రాయనున్నారో), అడ్మిట్‌కార్డుల డౌన్‌లోడింగ్, ఫలితాల వెల్లడి వంటి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామంది. నీట్ పరీక్షను ఆఫ్‌లైన్‌లో పెన్, పేపర్ పద్ధతిలో నిర్వహించనున్న విషయం తెలిసిందే. ఈ పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహించాలన్న ప్రతిపాదనలు వచ్చినా జాతీయంగా 25 లక్షలకు పైగా విద్యార్థులు హాజరయ్యే అవకాశముండటంతో ప్రస్తుతానికి ఆఫ్‌లైన్‌లోనే నిర్వహిస్తున్నారు. దరఖాస్తు చేసే విద్యార్థుల సౌలభ్యం కోసం ఎన్టీఏ హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేసింది. విద్యార్థులు 01140759000, 01169227700 లేదా neetus2026@nta. ac.in ఈమెయిల్‌ను సంప్రదించాలని ఎన్టీఏ సూచించింది.

# సిద్దిపేటలో పెద్దపులి బీభత్సం.. ఒక్కరోజే ఆరు పశువుల హతం!

**సిద్దిపేట జిల్లాలో పెద్దపులి సంచారం కలకలం**

**కోహెడ, నంగునూరు మండలాల్లో వరుస దాడులు**

**డ్రోన్లు, ప్రత్యేక బృందాలతో గాలిస్తున్న అటవీ అధికారులు**

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ**



సిద్దిపేట జిల్లాలో పెద్దపులి సంచారం స్థానిక ప్రజలను తీవ్ర భయాందోళనకు గురిచేస్తోంది. ఆదివారం ఒక్కరోజే వేర్వేరు ప్రాంతాల్లో ఏకంగా ఆరు పశువులను చంపేయడంతో పలు గ్రామాలు వణికిపోతున్నాయి. దీంతో అప్రమత్తమైన అటవీ శాఖ అధికారులు, పులిని పట్టుకునేందుకు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. కోహెడ మండలం ఆరెపల్లి సమీపంలోని చంద్రానాయక్ తండాలో మలోత్ రమేశ్ అనే రైతుకు చెందిన ఐదు పశువులపై పులి దాడి చేసి చంపేసింది. ఇదే తరహాలో నంగునూరు మండలం ఘనాపూర్‌లో బాల్ రెడ్డి అనే రైతుకు చెందిన లేగదూడను హతమార్చి, మరో పశువును గాయపరిచింది. శనివారం జనగామ జిల్లా నుంచి సిద్దిపేట జిల్లాలోని దూల్మిట్ట మండలంలోకి ప్రవేశించిన ఈ పులి, అక్కడి నుంచి నంగునూరు, కోహెడ మండలాల్లోకి ప్రవేశించినట్టు అధికారులు గుర్తించారు. ఈ పులి మహారాష్ట్ర నుంచి తెలంగాణలోకి ప్రవేశించి, యాదాద్రి భువనగిరి, జనగామ జిల్లాల మీదుగా వందల కిలోమీటర్లు ప్రయాణించి సిద్దిపేటకు చేరుకున్నట్లు అటవీ శాఖ అధికారులు భావిస్తున్నారు. తనకంటూ ఒక కొత్త ఆవాసాన్ని ఏర్పాటు చేసుకునే క్రమంలోనే ఇది పశువులపై దాడి చేస్తుండవచ్చని అంచనా వేస్తున్నారు. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు ఘటనా స్థలాలకు చేరుకుని పులి పాదముద్రలను సేకరించారు. డ్రోన్లు, కెమెరా ట్రాప్‌లతో పాటు మహారాష్ట్రలోని తడోబా, పుణె నుంచి వచ్చిన ప్రత్యేక రెస్క్యూ బృందాల సహాయంతో పులి కదలికలను నిశితంగా గమనిస్తున్నారు. ప్రజలు ఒంటరిగా బయటకు వెళ్లవద్దని, పశువులను సురక్షిత ప్రాంతాల్లో కట్టివేయాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నష్టపరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు.

## ప్రేమ వివాహం విషాదాంతం.. తిరుపతి జిల్లాలో కంటతడి పెట్టిస్తున్న ఘటన

తిరుపతి జిల్లా పుత్తూరులో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఆర్థిక సమస్యలు, కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఓ తల్లి తన ఇద్దరు కన్నబిడ్డలకు ఉరివేసి, ఆపై తానూ ఆత్మహత్య చేసుకుంది. పుత్తూరులోని కృష్ణానగర్‌లో శనివారం జరిగిన ఈ హృదయ విదారక ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఆత్మహత్యకు ముందు ఆ తల్లి రాసిన సూసైడ్ నోట్, ఆమె పడిన మానసిక వేదనను కళ్లకు కడుతోంది.

పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం... పద్మ (28) అనే మహిళ తన కుమార్తెలు తేజ శ్రీ (6), లాస్య (5)లను చంపి, అనంతరం తానూ బలవన్మరణానికి పాల్పడింది. నిన్న సాయంత్రం భర్త శివశంకర్ ఇంటికి వచ్చి చూడగా ఈ దారుణం వెలుగులోకి వచ్చింది. పద్మ, శివశంకర్ డిగ్రీ చదివే రోజుల నుంచి ప్రేమించుకుని, 2019లో పెద్దలను ఎదిరించి వివాహం చేసుకున్నారు. అయితే, పెళ్లైన తర్వాత కూడా శివశంకర్ ఏ పనీ చేయకుండా బాధ్యతారహితంగా ఉండటంతో కుటుంబంలో ఆర్థిక కష్టాలు మొదలయ్యాయి. పిల్లల స్కూల్ ఫీజులు, ఇంటి ఖర్చులు, డ్వాక్రా సంఘంలో తీసుకున్న అప్పు చెల్లించలేక పద్మ తీవ్రంగా మదనపడినట్లు తెలుస్తోంది. ఈ విషయమై శనివారం భర్తకు ఫోన్ చేయగా, డబ్బులు సర్దుబాటు కాలేదని చెప్పడంతో ఆమె తీవ్ర మనస్తాపానికి గురైంది. ఇదే క్రమంలో ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు.



## మేడిపల్లిలో విషాదం: ప్రియురాలితో వీడియో కాల్‌లో మాట్లాడుతూ బాలుడి బలవన్మరణం

**ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్న బాలుడు**

**విషయాన్ని అతడి స్నేహితులకు తెలియజేసిన అమ్మాయి**

**ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విద్యార్థి**

**తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు**

ప్రియురాలితో వీడియో కాల్ మాట్లాడుతూ 17 ఏళ్ల బాలుడు ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం బోడుప్పల్ అయ్యప్పస్వామి దేవాలయం సమీపంలో నివసించే ఓ ప్రైవేటు ఉద్యోగి కుమారుడు స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో చదువుతున్నాడు. ప్రస్తుతం మేడిపల్లిలోని ఓ కార్ల షోరూమ్‌లో ప్రాక్టికల్ ట్రైనింగ్ తీసుకుంటున్నాడు. ఈ నెల 5వ తేదీ రాత్రి బాలుడి తల్లిదండ్రులు షాపింగ్ కోసం బయటకు వెళ్లారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న అతడు, తాను ప్రేమించిన అమ్మాయికి వీడియో కాల్ చేశాడు. ఆమెతో మాట్లాడుతూనే చున్నీతో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. ఈ ఘటనతో ఆందోళనకు గురైన ఆ యువతి వెంటనే అతడి స్నేహితులకు సమాచారం అందించింది. స్నేహితులు హుటాహుటిన బాలుడి ఇంటికి చేరుకుని, అప్పటికే ఉరి వేసుకుని ఉన్న అతడిని సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మేడిపల్లి పోలీసులు తెలిపారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.

## ఓఆర్‌ఆర్‌పై ఏప్రిల్ 1 నుంచి నగదు చెల్లింపులు బంద్.. పెరగనున్న టోల్ చార్జీలు!

హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్‌ఆర్) ప్రయాణికులకు ముఖ్య గమనిక. ఏప్రిల్ 1 నుంచి ఓఆర్‌ఆర్‌పై ఉన్న అన్ని టోల్ ప్లాజాల వద్ద నగదు చెల్లింపులను పూర్తిగా నిలిపివేయనున్నారు. ఇకపై ఫాస్టాగ్ లేదా యూపీఐ క్యూఆర్ కోడ్ ద్వారా మాత్రమే టోల్ రుసుము చెల్లించాల్సి ఉంటుంది. జాతీయ రహదారులపై కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న క్యాష్‌లెస్ విధానాన్ని అనుసరించి ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం ఫాస్టాగ్ ఉన్న వాహనాలు ఆటోమేటిక్‌గా స్కాన్ అవుతుండగా, ఫాస్టాగ్ లేనివారు నగదు చెల్లించే అవకాశం ఉంది. ఏప్రిల్ 1 నుంచి ఈ నగదు విధానాన్ని పూర్తిగా రద్దు చేస్తున్నారు. అలాంటి వారు ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం వంటి యాప్‌ల ద్వారా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి చెల్లింపులు చేయవచ్చు. ఓఆర్‌ఆర్‌పై పెద్ద అంబర్‌పేట్, మేడ్చల్, కోకాపేట, శంషాబాద్‌తో సహా మొత్తం 19 ఇంటర్‌ఛేంజ్ టోల్ ప్లాజాలను హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) నిర్వహిస్తోంది. నగదు నిర్వహణ, రవాణా, భద్రపరచడం వంటి సమస్యలతో పాటు చిల్లర విషయంలో ప్రయాణికులకు, సిబ్బందికి మధ్య తరచూ వాగ్వాదాలు జరుగుతున్నాయని హెచ్‌జీసీఎల్ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. రికార్డుల నిర్వహణలో పారదర్శకత లోపించడం, దొంగతనాల వంటి భద్రతాపరమైన సమస్యలను అధిగమించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. మరోవైపు ఓఆర్‌ఆర్‌పై టోల్ చార్జీలను కూడా 2026 ఏప్రిల్ 1 నుంచి పెంచే అవకాశం ఉంది. చివరిసారిగా 2024 ఏప్రిల్‌లో టోల్ రేట్లను సవరించారు. వివిధ కారణాల వల్ల 2025 ఏప్రిల్‌లో పెంపును చేపట్టలేదు.